ప్రజాశక్తి
శుక్రవారం 7, ఏప్రిల్ 2023



ఒకేసారి పన్ను చెల్లిస్తే రాయితీ

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఒకేసారి చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30, 2023 వరకు ఈ రాయితీ వర్తించనున్నట్లు తెలిపారు. కావున నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన కౌంటర్లు లేదా పాతవూరు కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న 17వ వార్డు సచివాలయం, రామ్‌నగర్ మీసేవ పక్కన ఉన్న 54వ వార్డు సచివాలయం, 2వ రోడ్డులోని స్టడీ పార్క్ పక్కన ఉన్న 64వ వార్డు సచివాలయం, నవోదయ కాలనీ ఆటోస్టాండ్ పక్కన ఉన్న 41వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పన్నులు చెల్లించవచ్చున్నారు. అంతేకాకుండా పన్నులను ఆన్-లైన్ ద్వారా చెల్లించేందుకు https://cdma.ap.gov.in%/ వెబ్‌సైట్‌లో %Credit Card/Debit Card/Net-Banking/UPI% ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పేదలందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్ర ప్రజలందరికీ తమ ఇంటివద్దే మెరుగైన వైద్యసేవలు అందించడమే సిఎం జగన్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చాపిరి గ్రామంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైద్యవిధానంలో నూతన ఒరవడికి వైసిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పేదలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే పని లేకుండా ఇంటివద్దనే మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి పేదలకు వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా వాహనంలో డాక్టర్‌తోపాటు వైద్యసిబ్బంది గ్రామానికి చేరుకుని ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులు అక్కడే సరఫరా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, ఎంపిడిఒ రంగారావు, తహశీల్దార్ నాగభూషణం, అధికారులు పాల్గొన్నారు.

'అనంత' అభివృద్ధిపై చర్చకు సిద్ధం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి స్పష్టం చేశారు. గురువారం నగరంలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1995 నుంచి 2000 సంవత్సరం వరకు తాను మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రజలకు అనేక సేవలందించానన్నారు. దేశంలోనే అనంత మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్ది అప్పటి ప్రధానితో అభినందనలు పొందానని గుర్తు చేశారు. 40 ఏళ్ల పరిపాలన గొప్పగా చేశానంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానన్నారు. వయస్సు మీద పడిన నాయకుడివి ఇష్టం మొచ్చినట్లు నారా లోకేష్‌పై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రింగ్ రోడ్డు, నేషనల్ పార్క్, నీటి ట్యాంకులు, పైపు లైన్‌లు, రోడ్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, మున్సిపల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, ఎన్టీఆర్ మార్గ్, భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థకు జిఒతో సహా నిధులు కేటాయింపు వంటివి తాను చేసినవే అన్నారు. చేసిన అభివృద్ధిపై కట్టుబడి ఉండటంతోపాటు జిఒలతోసహా ఆధారాలు చూపిస్తానన్నారు. తాము తీసుకొచ్చిన రింగ్ రోడ్డుకు నీవు కమీషన్లు తీసుకుని నగరంలో రోడ్లు వంపులు తిప్పావని ఆరోపణలు ఉన్నాయన్నారు. ఏ కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా అంటూ ప్రశ్నించారు. అలాగే సెంట్రల్ పార్క్ స్థలాన్ని సుబ్రహ్మణ్యేశ్వర ట్రస్టుకు ధారా దత్తం చేయాలని చూసింది వాస్తవం కాదా అన్నారు. కోర్టు ఆర్డర్ ద్వారా అడ్డుకున్నానని లేకపోతే దానిని కూడా ఆక్రమించే వారన్నారు. సూర్యానగర్ రోడ్డు హౌసింగ్ బోర్డ్ రోడ్డు బస్టాండ్ రోడ్ ఎన్టీఆర్ మార్గ్, రోడ్డు శ్రీనగర్ 80 ఫీట్ రోడ్డు, నేను అభివృద్ధి చేసినవే అన్నారు. చౌకబారు రాజకీయాలు చేస్తూ మా మీద రకరకాల కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు మీ పార్టీ కార్పొరేటర్లే నీ అవినీతి గురించి చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కార్పొరేషన్‌లో కార్పొరేటర్లు సమావేశంలోనే కింద కూర్చుని, అవినీతి గురించి, సమస్యలపై మాట్లాడుతున్న స్పందించడం లేదన్నారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సరికాదన్నారు. ఏదిఏమైనా అభివృద్ధి, అవినీతిపై ప్రమాణం చేయడానికి కూడా తాను సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమ నాయకుడు బిటి రణదీవే

సిఐటియు ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిఐటియు వ్యవస్థాపకులు బీటీ.రణదీవే అందించిన సేవలు ఎంతో ఆదర్శనీయంగా నిలిచాయని, కార్మిక ఉద్యమ నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయాడని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏజి.రాజమోహన్ అన్నారు. గురువారం రాజీవ్ కాలనీ పరిధిలోని సిపిఎం నూతన కాలనీలో కార్మిక ఉద్యమ నేత బిటీ రణదీవే 33వ వర్ధంతి సభ నిర్వహించారు. ఇందులో భాగంగా సిఐటియు నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికోద్యమ చరిత్రలో బిటి రణదీవే పాత్ర ఘనమైనదన్నారు. భారత దేశంలో ఈ రోజు కార్మిక సంఘాలలో మొదటి స్థానంలో ఉన్న సిఐటియును నిర్మించడంలో ఆయన పాత్ర చాలా గొప్పదన్నారు. ఆ రోజుల్లో బొంబాయిలో ఉన్నటువంటి నూలు మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు, నేవీ కార్మికులకు సరైన సదుపాయాలు, వేతనాలు ఇవ్వాలని ఆయన ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నడిచాయని తెలిపారు. భారతదేశంలో కార్మిక రాజ్యం రావాలంటే కార్మిక, కర్షకులు ఐక్యంగా పోరాడాలని ఆ రోజుల్లోనే గుర్తించి ఆ విధమైన పోరాటాలు చేశారని తెలిపారు. కానీ నేడు భారతదేశంలో పరిస్థితులను గమనిస్తే కార్మికుల యొక్క శ్రమను దోపిడీ చేస్తున్నారని దోపిడీ చేసే వారికే బిజెపి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందన్నారు. భారతదేశం సంపద కొంత మంది బడా పెట్టుబడుదారుల చేతుల్లోకి పోతోందని తెలిపారు. కావున బిటి రణదీవే ఆశయాలు కొనసాగించాలంటే భారతదేశం యొక్క సంపదను దేశంలో ఉన్నటువంటి కార్మికులకు కర్షకులకు, బడుగు బలహీన వర్గాల చేతుల్లోకి తీసుకురావాల్సిందేనని అప్పుడే మనకు నిజమైన స్వతంత్రం వచ్చినట్లు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, గఫూరు ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మసూద్, వలీ, ఇస్మాయిల్, శివ, వెంకటేశు, మళ్లీ, మోహన్, పక్రుణ్ణి, మాభున్నీ తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు వ్యవస్థాపకులు బిటి.రణదీవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చల్లగా..చంపేస్తుంది..!

ఐస్..ఐస్..వేసవి వచ్చిందంటే దీన్ని తలచని మనిషే ఉండదు. ఎండ తాపం నుంచి బయటపడేందుకు ఎక్కువ మంది ఐస్‌ను ఆశ్రయిస్తుంటారు. ఏది తాగాలన్నా.. తినాలన్నా.. చల్లని ఐస్ లేనిదే గొంతులో దిగదు. రోడ్డు మీద కనిపించే షరబత్ బండి మొదలు పెద్ద పెద్ద రెస్టారెంట్లలోని జ్యూస్ షాపుల వరకూ చివరకి పాలతో చేసిన మజ్జిగ, లస్సీ వంటివి తాగాలన్నా అందులో ఐస్ వేయాల్సిందే. పేద ధనిక అన్న తేడా లేకుండా అంతా ఐస్ తాగుతుంటారు. అలాంటి ఐస్ ఎలా తయారవుతుంది.. చల్లని ఐస్‌లో ఏముంది.. ఈ విషయాలు తెలుసుకోనేందుకు ప్రజాశక్తి పరిశీలన చేసింది..

కలుషిత నీటితో ఐస్ తయారీ
తుప్పు పట్టిన డబ్బాల్లో నిల్వ
రోగాల బారిన జనం
పట్టించుకోని అధికార గణం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్, పరిగి రోడ్డు, హస్నాబాద్, డిబి కాలనీ, మోడల్ కాలనీ, పరిగి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న ఐస్ తయారీ కేంద్రాలను ప్రజాశక్తి గురువారం పరిశీలించింది. ఇందులో ఎవరూ ఊహించని నిజాలు బయట పడ్డాయి. అక్కడ అటోల్లో, సైకిళ్లలో వచ్చి ఐస్ కొనుక్కుంటున్న వారితో వివరాలు తెలుసుకుని ఐస్ ఫ్యాక్టరీని పరిశీలించింది.

కలుషిత నీరే ఐస్..

ఐస్ దిమ్మలు తయారు చేసేందుకు వాడే నీరంతా కలుషితమే. అదే నీటిని తుప్పు పట్టిన ఇనుప డబ్బాల్లో పెట్టి, ఒక పెద్ద ట్యాంకులో దించారు. ఆ ట్యాంకులో శుభ్రం చేయని నీరు ఉంది. అది ఉప్పు కలపబడిన మురుగు నీరు. ఇందులో ఐస్ తయారీ చేస్తున్నారు. తయారైన ఐస్‌ను మళ్లీ కలుషిత నీటిలోకి వేసి ఐస్ గడ్డలను బయటకు తీస్తున్నారు. ఇలా తయారు చేసిన ఐస్‌ను ముక్కలుగా చేసి షరబత్,



కలుషిత నీటిలో కూలింగ్ కోసం ఉంచిన పుల్ల ఐస్

మజ్జిగ, లస్సీ, పెద్ద పెద్ద రెస్టారెంట్లు, జ్యూస్ సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. హిందూపురం పట్టణం అంతా ఇదే పరిస్థితి ఉంది.



స్థానికంగా తయారు చేసిన ఐస్‌లు

ఐస్ ఫ్యాక్టరీలు రెండు రకాలు..

ఐస్ ఫ్యాక్టరీలు రెండు రకాలు. ఒకటి స్టోరేజి కోసం వినియోగించే ఐస్. దీంతో చేపలు, మాంసం తదితర వాటి నిల్వల కోసం వాడుతారు. ఇదే ఐస్‌ను శవ పేటిల్లో కుడా వాడుతారు. రెండోది ప్రజలు శీతల పానీయాల్లో కలుపుకుని తాగేది. అయితే పట్టణంలో అన్నింటికీ ఇదే ఐస్‌ను వాడుతున్నట్లు సమాచారం. రోజుల తరబడి ఒకే నీటినే వినియోగిస్తూ.. నీటిని మార్చకపోవడంతో ప్రమాదకర వైరస్ మనిషిని రోగాల బారిన పడేస్తుందని వైదులు పేర్కొంటున్నారు.

హిందూపురం పట్టణంలో సుమారు 1.70 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరితో పాటు వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది పట్టణానికి వస్తుంటారు. ఇందులో ఏదో ఒక రూపంలో దాదాపు 70 శాతానికి పైగా ఐస్‌ను వాడతారు. జిల్లాలో ప్రతి మండలం. డివిజన్ కేంద్రాల్లో ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి ద్వారా రోజూ ఒక్కో ఫ్యాక్టరీలో వేలాది రూపాయల ఐస్‌ను విక్రయిస్తున్నారు. వ్యాపారులకు రూ.వేలు తెచ్చి పెట్టే ఐస్ ఫ్యాక్టరీలు ప్రజల ఆరోగ్యాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.



ఐస్ గడ్డలను మురికి నీటిలో వేసి బయటకు తీస్తున్న దృశ్యం

స్టోరేజ్ ఐస్‌తో ప్రమాదం

స్టోరేజ్ కోసం వినియోగించే ఐస్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. కలుషిత నీటితో ఐస్ తయారు కావడంతో వేగంగా గొంతు ఇన్‌ఫెక్షన్‌కు గురవుతారు. శ్వాసకు సంబంధించిన వ్యాధులు ఉన్న వారు ఐస్‌ను వాడరాదు. శుద్ధ జలంతోనే ఐస్ తయారుచేయాలి. లేదంటే ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఐస్‌తో అప్రమత్తం అవసరం.

- వెంకటరమణ నాయక్, వైద్యులు



కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రాంభూపాల్, జాఫర్

ఏప్రిల్ 14 నుంచి 30 వరకు రాజకీయ ప్రచార యాత్రలు
సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, జాఫర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనను ఐక్యంగా పోరాడి ఎండగడదామని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, సి.జాఫర్ పిలుపునిచ్చారు. గురువారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజను సమస్యల్లో నెట్టి వేస్తోందన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజలకు తెలియజేసి చైతన్యం తీసుకొచ్చేందుకు ఈనెల 14వ తేది నుంచి 30వ తేది వరకు రాజకీయ ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సిపిఎం, సిపిఐ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన జిల్లా, మండల, గ్రామాల స్థాయిలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అక్కడే సభలు నిర్వహించి మోడీ విధానాలను ఎండగడతామన్నారు. అందులో భాగంగా జిల్లాలో కూడా 14వ తేది నుంచి రాజకీయ ప్రచారయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. 15వ తేది బుక్కరాయసముద్రం మండలం, జంతలూరు గ్రామంలో శంకుస్థాపన చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి అనంతపురం వరకు పాదయాత్ర, గుంతకల్ రైల్వేజోన్ కోసం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రచారయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ ప్రభుత్వం విధానాలు పెను ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు పెరిగాయన్నారు. రాష్ట్ర విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు అధ్యాపకులు, సిబ్బందిని నియమించలేదన్నారు. కనీసం ప్రహరీ కూడా నిర్మించని పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థినులకు హాస్టల్ వసతి లేదన్నారు. జిల్లాలో ఏర్పాటు చేస్తామన్న నాసన్, బెల్ సంస్థలు ఏర్పాటు చేయలేదన్నారు. గుంతకల్ రైల్వే జోన్ ఏర్పాటు చేయలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరిస్తోందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ రాజకీయ విధానాలతో దేశ ఐక్యతకు విఘాతం ఏర్పడిందన్నారు. న్యాయ వ్యవస్థను తమ ఆధీనంలో పెట్టుకుని రాజ్యాంగ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేయాలనే విధానాలు అమలు చేస్తోందన్నారు. ఇలాంటివి సమాజంలో మంచిది కాదన్నారు. దీన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. ప్రశ్నించాల్సిన అధికార, ప్రధాన ప్రతిపక్షాలు మోడీకి పొర్లు దండాలు పెడుతూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ మోడీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. విదేశాల్లో దాచుకున్న నల్లధనం దేశానికి తీసుకొచ్చి పేదలకు పంచిపెడతామని మాటలకే పరిమితం అయ్యారని తెలిపారు. నోట్లు రద్దుచేసి ప్రజలకు మంచి రోజులు వస్తాయని నమ్మించారని, అదానీ, అంబానీ వంటి ధనవంతులకు మంచి రోజులు వచ్చాయని విమర్శించారు. 9 ఏళ్ల మోడీ పాలనలో నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. అదానీ ఢొల్ల కంపెనీలతో ఆర్థిక నేరానికి పాల్పడ్డారని చెబుతున్నా స్పందన లేదన్నారు. జెపిసి కమిటీ వేయమంటే వేయడం లేదన్నారు. ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు కూడా లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారని, రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దే ఇందుకు నిదర్శనం అన్నారు. పోలవరం ప్రాజెకును కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉందన్నారు. కానీ ఇస్తామన్న నిధులు కూడా ఇవ్వలేదన్నారు. కర్ణాటకలో మాత్రం అప్పర్ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ. 5,390 కోట్లు కేటాయించారని తెలిపారు. ప్రశ్నించాల్సిన వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మోడీకి మోకరిల్లుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదన్నారు. మోడీ, జగన్ విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు 14వ తేది నుంచి 30వ తేది వరకు ప్రచారయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, మల్లికార్జున, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిపిఎం నాయకులు ముస్కిన్, వెంకటనారాయణ, సిపిఐ నాయకులు రమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎఐఎస్ఎఫ్ఐ నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం

వైసిపిని సాగనంపితే తప్ప రాష్ట్రం బాగుపడదు
యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి- అనంపురం కలెక్టరేట్

రాష్ట్రంలో బిసిలు తీవ్ర వెనకబాటుకు గురువుతున్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో అన్యాయం జరుగుతోందని, వెనుకబడిన వర్గాలు, కులాలకు తెలుగుదేశం పార్టీ హయాంలోనే న్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర 62వ రోజు కూడేరు నుంచి కమ్మూరు మీదుగా కోటంక, మర్తాడుకు చేరుకుంది. కమ్మూరులో బిసి సామాజికవర్గం ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖిలో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నేడు బిసిల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలకు అన్యాయం చేస్తోందన్నారు. బిసిలపై అక్రమ కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ రావడంలేదన్నారు. విదేశీ విద్య పథకాన్ని కూడా ఆపేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పథకాన్ని భ్రష్టు పట్టించారని తెలిపారు. బీసీ రెసిడెన్షియల్ హాస్టల్స్, కాలేజీలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈడిగ కులస్తులను ప్రభుత్వం వేధిస్తోందన్నారు. బోయ కులస్తులకు ఎటువంటి సహాయం అందడం లేదన్నారు. పేరుకే కార్పొరేషన్‌లు ఉన్నాయన్నారు. ఒక్క రూపాయి రుణం ఇవ్వలేదన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బటన్ నొక్కినా తల్లిదండ్రుల ఖాతాలో డబ్బులు పడటం లేదన్నారు. బిసిలకు టిడిపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం రాగానే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామన్నారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తామన్నారు. బిసి ఉప కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈడిగ కులస్తులను ప్రోత్సహించింది టిడిపినే అన్నారు. ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించామని, జగన్ సొంత మద్యం వ్యాపారం కోసం కల్లుగీత కార్మికులను వేధిస్తున్నాడని విమర్శించారు. మృతి చెందిన, గాయపడిన ఒక్క కల్లుగీత కార్మికుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. 26 వేల మంది బిసిలపై కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చంద్రన్న బీమాని ఇంకా పటిష్టంగా అమలు చేస్తామన్నారు. జగన్‌కి బీసీలంటే ప్రేమ లేదని, అందుకే డమ్మీ కార్పొరేషన్‌లు పెట్టారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దామాషా ప్రకారం బీసీ ఉపకులాలకు నిధులు కేటాయిస్తామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామని, న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నియోజకవర్గాల వారీగా బిసిలకు రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎఎస్పీ నాగేంద్రుడు

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

అనంతపురం సిటీ : ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు నగరంలోని లక్ష్మీస్కూల్, నారాయణ ఇ టెక్నో, మాంటెస్సోరి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను అనతపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎవరైనా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్, తదితర అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకేసారి పన్ను చెల్లిస్తే రాయితీ

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులు తమ ఇంటి పన్ను, ఖాళీ స్థలాలకు ఒకేసారి పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశు లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ టాక్స్ కట్టిన లబ్ధిదారులకు కూడా 5 శాతం రాయితీ వర్తింపు ఉందన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పది పరీక్షలకు 331 మంది గైర్హాజరు

అనంతపురంసిటీ : పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం 2వ రోజు జరిగిన పరీక్షకు జిల్లావ్యాప్తంగా 331 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిఇఒ ఎం.సాయిరామ్, ఎసి గోవిందనాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 139 పరీక్ష కేంద్రాల్లో 29,848 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 29,517 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఒక కేంద్రం, డిఇఒ 8 కేంద్రాలను, ఎసి ఒకటి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 49 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

లోకేష్ యాత్రకు గార్లదిన్నె తమ్ముళ్ల ఘన స్వాగతం

ప్రజాశక్తి-గార్లదిన్నె

టిడిపి యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నియోజకవర్గంలోని ప్రవేశించడంతో తెలుగుతమ్ముళ్లు గురువారం ఘనస్వాగతం పలికారు. కూడేరు మండలం నుంచి గురువారం సాయంత్రం గార్లదిన్నె మండలం కోటంకకు చేరుకోగానే అప్పటికే భారీగా చేరుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గేట్ కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, బాలకృష్ణ, పాండు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రకు భారీగా తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు

యువత ఉన్నత లక్ష్యంతో ఎదగాలి : మంత్రి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

యువత ఉన్నత లక్ష్యాలతో ఎదిగి తమ కుటుంబం తోపాటు సమాజానికి సేవలు అందించాలని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్పీ ఫక్కీరప్ప, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ శ్రీనివాసులు ఎంతో ఉన్నతాశయంతో జాబ్‌మేళా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ కంపెనీల్లో అర్హత పొందిన యువతీ, యువకులకు జాయినింగ్ లెటర్లు అందజేశారు.

జగన్‌ను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజారంజక పాలన అందిస్తూ దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక అర్హత కనీస రాజకీయ పరిజ్ఞానం లేని నారా లోకేష్ లేదని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తొగట వీర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.వేల కోట్లు దోచుకున్న లోకేష్ సిఎంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్, పయ్యావుల కేశవ్ మాట్లాడుతుంటే దొంగలే దొంగ దొంగ అన్నట్లుగా ఉందన్నారు. లోకేష్ తన యువగళంలో ఏది పడితే అది మాట్లాడుతున్నాడన్నారు. ముఖ్యంగా సిఎం జగన్‌ను స్కామ్ మోహన్‌రెడ్డి అని పిలవడాన్ని తప్పుపట్టారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే చాలా మంచిదని హితవు పలికారు. కేశవ్ పిట్టలదొరలా మాట్లాడుతున్నాడన్నారు. చెరువులకు నీళ్ల విడుదల పేరుతో నాడు చోళసముద్రం, ఇప్పేరు, లత్తవరం వద్ద ఆయా గ్రామాల రైతుల మధ్య చిచ్చు పెట్టిన విషయం తెలియదా.. అని ప్రశ్నించారు. అదే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పరిహారం అందించి ప్రశాంతత నెలకొనేలా చేశామన్నారు. నియోజకవర్గంలో గాలిమరల ఏర్పాటు సందర్భంగా రైతుల నుండి భూ సేకరించే క్రమంలో పయ్యావుల సోదరులు కొందరు బ్రోకర్ల ద్వారా రూ.కోట్లు దోచుకున్నార విమర్శించారు. హంద్రీనీవా కెనాల్‌ను నాడు రాజశేఖర్‌రెడ్డి నిర్మిస్తే అది మీ గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మీ పాపాల వల్లే హంద్రీనీవా బాధిత రైతులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాకెట్ల-ఆమిద్యాల లిఫ్ట్, రాగులపాడు వద్ద డిస్ట్రిబ్యూటరీ పనులు ప్రారంభమయ్యాన్నారు. హంద్రీనీవా నుంచి జిల్లాకు అత్యధికంగా నీరు తెచ్చామన్నారు. మీలా రైతాంగాన్ని మోసం చేయలేదన్నారు. ఇప్పటికైనా మీరు మారకపోతే ప్రజలు శాశ్వతంగా ఛీకొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్, వైస్ ఎంపిపి నరసింహులు, ఎంబిసి రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేష్, నాయకులు ఏసీ ఎర్రిస్వామి, వెంకటరెడ్డి, అశోక్‌కుమార్, సుంకన్న, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

తరగతి గదుల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాల్లో తరగతుల తీరును, విద్యార్థుల హాజరును ఉపకులపతి జి.రంగజనార్ధన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు పట్టీలు, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోని వివిధ ల్యాబోరేటరీలను పరిశీలించారు. తర్వాత ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వివిధ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల అధికారులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, హెచ్.సుదర్శనరావు, పి.ఆర్.భానుమూర్తి, అరుణకాంతి, వైశాలి గోర్పడే, దిలీప్, ఇసిఇ విభాగాధిపతి విష్ణువర్ధన్, హాస్టల్ మేనేజర్ చంద్రమోహన్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముట్టాలలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలి డాక్టర్ విధానంలో భాగంగా గురువారం మండల పరిధిలో ముట్టాల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో వివిధ రకాల జబ్బులకు భాగంగా 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందజేశారు. అలాగే 38 మంది గర్భిణులు, ఏడుగురు జోలీ బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. 35 మందికి రక్తపోటు, మధుమేహం, ఇతర జబ్బులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సబిహా సుల్తానా, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ నవత, ఎఎన్ఎం లక్ష్మీ, ఆశా కార్యకర్తలు రమణమ్మ, మల్లమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిద్దాం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిద్దామని ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న రాయల్ ఫంక్షన్‌హాల్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖరరెడ్డి వివరించారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే 90 శాతంపైగా హామీలను నెరవేర్చామన్నారు.కోవిడ్ వంటి పరిస్థితుల్లోనూ సంక్షేమం అందించిన ఏకైక సిఎం జగన్ అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం, మన ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించాలన్నారు. గతంలో పింఛన్ కోసం ఎదురు చూడాల్సి వచ్చేదని, కానీ నేడు సచివాలయ వ్యవస్థతో వాలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే నేరుగా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించాలన్నారు. ఇదే సమయంలో సోషల్ మీడియాను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. నగరంలోని పలు కాలనీల్లో కేవలం మూడు, నాలుగు అడుగులున్న సందుల్లోనూ సీసీ రోడ్లు వేశామన్నారు. వీటన్నింటినీ ఫొటోలు తీసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. అదేవిధంగా పంగల్ రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు జరుగుతున్న అర్బన్ లింక్ వైడనింగ్ ప్రాజెక్ట్ కూడా వైసీపీ అధికారంలోకి వచ్చాకే ముందుకు సాగుతున్నాయన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి కరపత్రాలకే పరిమితమైందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అనంతపురంలో అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నారా లోకేష్‌కు అనంత వెంకటరామిరెడ్డిని విమర్శించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతకుంట మధు, లక్ష్మన్న, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ ఓబిరెడ్డి, వైసిపి అనుబంధ సంఘాల రీజినల్ కో ఆర్డినేటర్లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు శ్రీదేవి, కృష్ణవేణి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-పుట్లూరు



ఆర్థికసాయం అందజేస్తున్న భూమిరెడ్డి ట్రస్టు సభ్యులు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి

భూమిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన విద్యార్థులకు గురువారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మంగళ వెంకటరాజు, నాగలక్ష్మి దంపతులకు ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. వీరి చదువు కోసం ఆర్థికసాయం చేయాలని భూమిరెడ్డి ట్రస్టును ఆశ్రయించడంతో రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. దీంతో ట్రస్టు సభ్యులకు వెంకటరాజు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'అనంత' సవాల్‌ను స్వీకరించే దమ్ముందా..

వైసిపి నేత ఆలమూరు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలో ఫోర్‌లైన్ రోడ్డు పనుల మంజూరులో టిడిపి నేతల ప్రమేయం ఉందని నిరూపిస్తే రాజీనామాకి సిద్ధమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేసిన సవాళ్లు స్వీకరించే దమ్ము టిడిపి నేతలకు ఉందా.. అని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. గురువారం నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో జరిగిన అభివృద్ధి చూసి ప్రతిపక్ష పార్టీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ప్రజాక్షేత్రంలో నేరుగా ఎమ్మెల్యేను ఎదుర్కోలేమన్న దద్దమ్మలు వ్యక్తిత్వహరణ చేసేలా ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో ఫోర్‌లైన్ రోడ్డు మీరు తీసుకొచ్చినట్లు ఆధారాలు చూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని దమ్మున్న నేతగా అనంత వెంకటరామిరెడ్డి సవాల్ విసిరారన్నారు. నిత్యం ప్రజల్లో ఉండటం, ప్రజా మన్ననలు పొందడం మాత్రమే అనంతకు చేతనవుతుందన్నారు. ఐటీ శాఖ మంత్రిగా పనిచేశానని చెప్పుకునే దద్దమ్మ నారా లోకేష్ అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ అయిన సెల్‌ఫోన్లు వచ్చినాక ఎన్ని నెంబర్లు కొడితే ఫోన్లు పని చేస్తాయనే విషయం కూడా తెలియదా.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టిడిపి నేతలు అసత్యాలు మానుకోవాలని లేదంటే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సాంస్కృతిక విభాగం రీజినల్ కోఆర్డినేటర్ రిలాక్స్ నాగరాజు, కార్పొరేటర్ శ్రీనివాసులు, వైసిపి నేత గోగుల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

సస్పెన్షన్‌కు గురైన ఇన్విజిలేటర్లను రీఓక్ చేయాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పదో తరగతి పరీక్షల సందర్భంగా సస్పెండ్ అయిన 8 మంది ఇన్విజిలేటర్‌లను వెంటనే రీఓక్ చేయాల్సిందే అని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ అధికారి సాయిరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, నాయకులు బి.నరసింహులు, ఎస్‌వివి.రమణయ్య, వి.కోటేశ్వరప్ప, లింగమయ్య, సుబ్బరాయుడు తదితరులు హాజరై మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఈ విధమైన చిన్న కారణాలకు సస్పెండ్ చేసిన పరిస్థితి లేదన్నారు. ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టే చర్యలు సరికావన్నారు. సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను రీఓక్ చేయాలన్నారు. లేని పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సూర్యుడు, సుబ్బారాయుడు, గంగాధర నాయుడు, పవన్, బాబు రావు, మహమ్మద్ గౌస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



యువత మేలుకో పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐ శ్రీనివాసులు


బెట్టింగ్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు..

ప్రజాశక్తి-అనంతపురం

ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో యువత బెట్టింగుల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని అనంతపురం త్రీటౌన్ సీఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం 'యువత మేలుకో.. ఐపీఎల్ బెట్టింగ్ జోలికి పోకు.. ఐపీఎల్ మ్యాచ్‌లో జరిగే బెట్టింగ్ అరికడదాం' అంటూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను కేవలం ఆటలాగే చూడాలన్నారు. బెట్టింగ్ పేరుతో చూస్తే నేరమన్నారు. అలా ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా యువకులు ఇలాంటి వారికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టినందుకు డివైఎఫ్ఐ నాయకులను అభినందించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహా మాట్లాడుతూ దేశంలో పెద్దసంఖ్యలో యువకులు క్రికెట్ బెట్టింగులతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా క్రికెట్ పట్ల యువతకు ఉన్న అభిమాన్ని అవకాశం తీసుకుని కొత్తమంది రోజుకు వేల, లక్షలాది రూపాయల వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాగర్, యోగి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎం.ఆదినారాయణ

ప్రజాశక్తి-శింగనమల



టిడిపి అనుబంధ కమిటీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన ఎం.ఆదినారాయణను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ టిడిపితోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. అంతేగాకుండా బిసిలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది కూడా టిడిపినే అన్నారు. జిల్లాలో మొదటిసారిగా రాష్ట్ర బీసీ సెల్ కమిటీలోకి నాయీబ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన తనను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. తన నియామకానికి సహకరించిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-పుట్లూరు



రికార్డులు తనిఖీ చేస్తున్న డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి సి.ఓబుళమ్మ

మండలంలోని కందికాపుల, బాలాపురం, కోమటికుంట్ల సచివాలయాలను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి సి.ఓబుళమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బయోమెట్రిక్ హాజరు, మూమెంట్ రిజిస్టర్, స్పందన రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. గర్భిణులు, 0 నుంచి 19 సంవత్సరాల పిల్లల వివరాలను సుస్థిరాభివృద్ధి లక్ష్యాల యాప్‌లో నమోదు చేయాలన్నారు. పుట్లూరు మండలంలో గర్భిణుల వివరాలు నమోదు 94 శాతం, 0 నుంచి ఐదేళ్ల పిల్లల నమోదు 66శాతం, 6 నుంచి 9 సంవత్సరాల పిల్లల నమోదు 84శాతం నమోదు చేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సచివాలయం, ఆర్‌బికె, వైఎస్ఆర్, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులకు సంబంధించిన పనులు, జల్ జీవన్ మిషన్ నిధుల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కోమటికుంట్లలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తడిచెత్త, పొడిచెత్త సేకరణ, వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'అనంత నెట్‌వర్క్' సేవలు అభినందనీయం



సిఎస్‌సి విహాన్ ఎయిడ్స్ బాధితులకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలిస్తున్న దృశ్యం

అనంతపురం : అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్స్ సంస్థ ద్వారా నగరంలోని అరవింద్ నగర్-2 క్రాస్‌లోని సిఎస్‌సి విహాన్ ఎయిడ్స్ బాధితులకు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ కామేశ్వర ప్రసాద్, పెప్ఫర్ పార్ట్‌నర్ డాక్టర్ శ్రీ రాజేంద్రప్రసాద్ గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ రిఫరెన్స్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనుసంధానం చేయుట, ఎఆర్‌టి చికిత్స వాడుతూ మధ్యలో ఆపిన వారిని తిరిగి తీసుకొచ్చి మందులు పెట్టించడంలో సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అనంత నెట్‌వర్క్ సంస్థ అధ్యక్షులు వీరాంజనేయులు, సిఎస్‌సి విహాన్, పీడీ రామాంజనేయులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ తేజస్విని, సిబ్బంది రాంబాబు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం

రాయదుర్గం : పట్టణంలోని కోటలో ఉన్న ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై చర్చించేందుకు శుక్రవారం స్థానిక ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసినట్లు దేవాదాయ శాఖ సమూహ ఆలయాల కార్యనిర్వహణ అధికారి కె.నరసింహారెడ్డి ఒక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేసేందుకు పట్టణ ప్రముఖులు, మేధావులు, ప్రజలు, భక్తులు సమావేశంలో పాల్గొని తగిన సూచనలు సలహాలు అందించాలని కోరారు.

లోకేష్.. విమర్శలు కాదు, ఏం చేస్తావో చెప్పు..

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ ఎమ్మెల్యేలను విమర్శించడం కాకుండా తన పార్టీ అధికారంలో వస్తే ఏం చేస్తారో చెబితే బాగుంటుందని వైసిపి మహిళా విభాగం జిల్లా ఆధ్యక్షురాలు శ్రీదేవి సూచించారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నారాలోకేష్ తన యువగళం పాదయాత్రలో ప్రతి నియోజకవర్గంలో అవినీతి జరిగిందని ప్రచారం చేస్తున్నారు తప్ప.. తాము అధికారంలో వస్తే ఏం చేస్తామో చెప్పలేక పోతున్నాడన్నారు. ఎందుకంటే చేసేకి ఏదీ లేదనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని సూచించారు. ఇప్పటికైనా నారాలోకేష్ ప్రభుత్వం, వైసిపి ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.